# కూతురి కండ్ల ఎదుటే..

- రివాల్వర్‌తో కాల్చుకున్న మంత్రి సబితా రెడ్డి సెక్యూరిటీ అధికారి
- ఆర్థిక సమస్యలు.. లోన్ రావడం లేదన్న మనస్తాపమే కారణం
- కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి సబితా ఇంద్రారెడ్డి

బంజారాహిల్స్, నవంబర్ 5: తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఒకవైపు, తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించాలంటూ ఒత్తిళ్లు మరోవైపు.. బ్యాంకు నుంచి రుణం రాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఏఆర్ ఎస్ఐ సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సెక్యూరిటీ బాధ్యతలు చూసే ఏఆర్ ఎస్ఐ మహ్మద్ ఫజల్ అలీ(59) ఆదివారం శ్రీనగర్ కాలనీలోని మంత్రి నివాసం సమీపంలోని టీ స్టాల్ వద్ద ఆత్మహత్య చేసుకున్నాడు. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. హుస్సేనీ అలం ప్రాంతంలోని కోకాకీ తట్టీ బస్తీలో నివాసముంటున్న మహ్మద్ ఫజల్ అలీ రాచకొండ కమిషనరేట్‌లోని ఆర్మ్‌డ రిజర్వ్ విభాగంలో ఏఆర్ ఎస్ఐగా పనిచేస్తున్నాడు. ఏడాది కాలంగా మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఎస్కార్ట్ బృందంలో విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం ఉదయం 6.30 సమయంలో తన కుమార్తె అసియా ఫాతిమా(24)తో కలిసి శ్రీనగర్ కాలనీకి వచ్చారు. మంత్రి నివాసానికి సమీపంలోని మణికంఠ హోటల్ వద్ద కుమార్తెను వేచి ఉండాలని సూచించాడు. డ్యూటీ వద్దకు వెళ్లి.. తన 9ఎంఎం సర్వీస్ రివాల్వర్ జేబులో పెట్టుకుని వచ్చాడు. కాసేపు కుమార్తెతో ఆర్థిక ఇబ్బందులు, రావాల్సిన లోన్ రాకపోవడం.. తదితర అంశాలపై చర్చించిన ఫజల్ అలీ.. కూతురు చూస్తుండగానే అకస్మాత్తుగా తన జేబులో నుంచి రివాల్వర్ తీసి కుడివైపు చెవి పైభాగంలో పాయింట్ బ్లాంక్‌లో పెట్టుకుని కాల్చుకొని.. అక్కడికక్కడే మృతి చెందాడు. క్షణాల్లో తన కళ్లముందే రివాల్వర్‌తో కాల్చుకుని తండ్రి మృతి చెందడంతో కుమార్తె అసియా ఫాతిమా షాక్‌కు గురైంది. సంఘటనపై సమాచారం అందుకున్న జూబ్లీహిల్స్ ఏసీపీ హరిప్రసాద్, ఇన్‌స్పెక్టర్ రవీంద్రప్రసాద్, ఎస్ఐ చంద్రశేఖర్ తదితరులు అక్కడికి చేరుకుని క్లూస్ టీమ్ సాయంతో ఆధారాలు సేకరించారు. మృతుడి చేతిలోని రివాల్వర్‌తో పాటు అతడి తలలోంచి బయటకు వచ్చిన బుల్లెట్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై సమాచారం అందుకున్న వెస్ట్‌జోన్ డీసీపీ జోయల్ డేవిస్ అక్కడికి చేరుకుని దర్యాప్తును పర్యవేక్షించారు. ఫజల్ అలీ ఆత్మహత్యపై సమాచారం అందుకున్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని, మృతుడు కుమార్తె ఆసియా ఫాతిమాను ఓదార్చారు. ఆమెతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఆర్థిక ఇబ్బందుల గురించి తనకు చెప్పి ఉంటే ఏదో రకంగా పరిష్కరించేవారిమని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఫజల్ అలీ కుటుంబానికి అండగా నిలబడతామని భరోసా కల్పించారు.





ఘటనా స్థలంలో విచారణ చేస్తున్న వెస్ట్‌జోన్ డీసీపీ జోయల్ డేవిస్, ఏఆర్ ఎస్ఐ మహ్మద్ ఫజల్ అలీ(ఫైల్)

## సమస్యల సుడిగుండంలో..

కుటుంబ సమస్యలతో పాటు భరించలేని ఆర్థిక ఇబ్బందుల కారణంగానే ఏఆర్ ఎస్ఐ ఫజల్ అలీ ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో తేలింది. తన తండ్రి గత కొంతకాలంగా తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారని, అప్పులు తీర్చేందుకు బ్యాంకు రుణం కోసం ప్రయత్నిస్తున్నా.. రుణం రాకపోవడంతో గత మూడు రోజులుగా ఆత్మహత్య చేసుకోవడం తప్ప మరో మార్గం లేదంటూ తన తండ్రి చెప్పాడని ఆసియా ఫాతిమా జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫజల్ అలీకి భార్యతో పాటు ముగ్గురు కుమార్తెలు, కొడుకు ఇమ్రాన్ ఉన్నాడు. వీరంతా హుస్సేనీ అలం ప్రాంతంలో అద్దె ఇంట్లో ఉంటున్నారు. ఇద్దరు కుమార్తెలకు అప్పులు చేసి పెళ్లిళ్లు చేశాడు. అయితే, కుటుంబ కలహాల కారణంగా వారిద్దరూ విడాకులు తీసుకొని పుట్టింటిలోనే ఉంటున్నారు. మూడో కుమార్తె ఆసియా ఫాతిమా కూడా పెళ్లీడుకు రావడంతో ఆమె పెళ్లి చేయాల్సి ఉంది. కొడుకు ఇమ్రాన్ సైతం చిన్నషాపు పెట్టుకుని జీవిస్తున్నా.. వచ్చే ఆదాయం సరిపోవడం లేదు. గత ఐదారేళ్లుగా తనకు వచ్చే జీతం మొత్తం వడ్డీలకు, ఈఎంఐలకు సరిపోడంతో.. అద్దె చెల్లించడానికి కూడా ఇబ్బందులు పడ్డాడని కుటుంబ సభ్యులు తెలిపారు. గతంలో తీసుకున్న రుణాల భారం కూడా ఎక్కువ కావడంతో ఇటీవల హుస్సేనీ అలంలోని బ్యాంక్ ఆఫ్ బరోడాలో రూ.10 లక్షల లోన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే, పదవీ విరమణ దగ్గరలో ఉండటంతో రుణం విషయాన్ని బ్యాంకు ఉద్యోగులు నానుస్తున్నారని తెలిపారు. ఇదే విషయంపై పలుమార్లు బ్యాంకు సిబ్బందితో వాగ్వాదం కూడా జరిగిందన్నారు. తనకు లోన్ రావడం కష్టమేనని, తనకు చావే శరణ్యమని నిర్ణయించుకున్న ఫజల్ అలీ ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ మేరకు పోలీసులు ఐపీసీ 174 సెక్షన్ కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## సీతాఫల్‌మండిలో పద్మారావుకు ఘన స్వాగతం



డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్‌తో కేక్ కట్ చేయిస్తున్న నాయకులు, అభిమానులు

సికింద్రాబాద్, నవంబర్ 5: ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్శితులైన ఇతర పార్టీల సీనియర్ నాయకుల బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ పార్టీ సికింద్రాబాద్ అభ్యర్థి తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. ఆదివారం సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో ప్రజలు పద్మారావుకు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ.. కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ పార్టీని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు హేమ, నగర డిప్యూటీ మేయర్ శ్రీలత రెడ్డి, పద్మారావు తనయులు కిశోర్‌గౌడ్, కిరణ్‌గౌడ్, రామేశ్వర్‌గౌడ్, త్రినేత్ర గౌడ్‌తో పాటు సీనియర్ నాయకులు సుంకు రాంచందర్, గరికపాటి చంద్రశేఖర్, లంబుకుమార్, మల్లూరి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




## బీఆర్ఎస్‌లో చేరిన యువకులు

బంజారాహిల్స్, నవంబర్ 5: బంజారాహిల్స్ డివిజన్ ప్రేమ్‌నగర్‌కు చెందిన పలువురు యువకులు ప్రేమ్‌నగర్ యూత్ లీడర్ ఆధ్వర్యంలో ఆదివారం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో సాయి, తరుణ్, దినేశ్, ముఖేశ్, లోకేశ్. రూపేశ్ తదితరులు ఉన్నారు.

### కాంగ్రెస్ మాయమాటలు నమ్మేందుకు

# మైనార్టీలు సిద్ధంగా లేరు

- జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్
- పెద్దసంఖ్యలో బీఆర్ఎస్‌లో చేరికలు



బీఆర్ఎస్‌లో చేరిన ఎర్రగడ్డ డివిజన్‌కు చెందిన యువకులతో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

బంజారాహిల్స్, నవంబర్ 5: ఎన్నో దశాబ్దాలుగా మైనార్టీలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూసి.. వారికి ఎలాంటి మేలు చేయని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో వచ్చి చెప్పే మాటలను నమ్మడానికి మైనార్టీలు సిద్ధంగా లేరని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. ఎర్రగడ్డ డివిజన్ బీఆర్ఎస్ నేతలు ఇజాజ్, ఫహీం ఆధ్వర్యంలో సుల్తాన్‌నగర్‌కు చెందిన సుమారు 100 మంది యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాలకు సమానంగా న్యాయం చేసిందన్నారు. ముఖ్యంగా పేదరికంతో ఇబ్బందులు పడే మైనార్టీల కోసం ప్రవేశపెట్టిన షాదీ ముబారక్, మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్స్, మైనార్టీ బంధు లాంటి పథకాలు ఎంతో ప్రయోజనంగా ఉన్నాయన్నారు. మైనార్టీలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకొనేందుకు కాంగ్రెస్ వేస్తున్న ఎత్తులను జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఓటర్లు తిప్పికొట్టడం ఖాయమన్నారు. రానున్న ఎన్నికల్లో గ్రేటర్ పరిధిలోని అన్ని సీట్లను మరోసారి బీఆర్ఎస్ పార్టీ గెలుచుకుని తీరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీలో చేరిన ఇజాజ్, సోహెల్, మహ్మద్ అశ్వక్, ఇంతియాజ్, ఇమ్రాన్, తేజ, నదీమ్ తదతరులు ఉన్నారు.

# కుత్బుల్లాపూర్‌లో బీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు

### కాంగ్రెస్, బీజేపీ, టీడీపీల నుంచి నాయకులు, కార్యకర్తల చేరిక

జీడిమెట్ల, నవంబర్ 5 : కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్, బీజేపీ, టీడీపీల నుంచి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆదివారం వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ సమక్షంలో వారు బీఆర్ఎస్‌లో చేరారు.

- జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి షిర్డీహిల్స్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు బండ నరేందర్ ఆధ్వర్యంలో 50 మంది ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. అదే విధంగా జగద్గిరిగుట్టకు చెందిన టీడీపీ సీనియర్ నాయకులు అమర్‌నాథ్ , ఎండి జహంగీర్ ఆధ్వర్యంలో 100 మంది, శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్ వేణుయాదవ్ ఆధ్వర్యంలో పలువురు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.
- చింతల్ డివిజన్ పరిధి వల్లభాయ్ పటేల్‌నగర్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకులు సుదర్శన్ రెడ్డి, నర్సింహా యాదవ్, సునీల్, ప్రసాద్, సిద్ధు, జీలాని, రమేశ్, రాజు ఆధ్వర్యంలో 150 మంది వల్లభాయ్ పటేల్ నగర్ కాలనీ అధ్యక్షులు శేఖర్ రావు ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మహ్మద్ రఫీ, మక్బూద్ అలీ, కె.పి.వెంకటేశ్ గౌడ్, బస్వరాజ్, కన్నెకంటి మల్లేశ్, ప్రభాకర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.
- రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి వెంకట్రామిరెడ్డి నగర్‌కు చెందిన ఇర్ఫాన్ ఖాన్ , అర్షద్, మస్తాన్, సోను ఆధ్వర్యంలో 150 మంది ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.
- సుభాష్‌నగర్ డివిజన్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు, కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయ ట్రస్టు చైర్మన్ బిజ్జిలి సాంబయ్య , నర్సింహ, శ్రీకాంత్ , శ్రీనివాస్, నూరాజ్, వాసు తన అనుచరులతో కలిసి ఆదివారం ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నవీన్ రాయ్, యేసు, బలరాంరెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.
- చింతల్ డివిజన్ పరిధి ఎన్‌ఎల్‌బీనగర్‌కు చెందిన జగదీశ్, వేణుమాదవ్, బాబ్లూ, చంటి, రామ్, రాఘవేంద్ర, సాయి, రమేశ్, యోగి, నర్సింహా తదితరులతో పాటు 50 మంది ఎన్‌ఎల్‌బీనగర్ యూత్ అధ్యక్షులు గిరిధర్ గౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కె.పి.వెంకటేశ్‌గౌడ్, శేఖర్ రెడ్డి, ప్రకాశ్, ప్రభాకర్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని వల్లభాయ్ పటేల్ నగర్‌లో బీఆర్ఎస్‌లో చేరిన వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్